నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
10-01-2026
పేజీలు: 02




# ఒకే ఫ్రేమ్‌లో అమితాబ్, సచిన్, రామ్ చరణ్!

బాలీవుడ్ షెహన్‌షా అమితాబ్ బచ్చన్, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ మరియు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన అరుదైన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ముగ్గురు దిగ్గజాలు ముంబైలోని ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవ వేడుకలో భాగంగా కలిసినట్లు తెలుస్తుంది. సినిమా, క్రికెట్ రంగానికి చెందిన ఈ ముగ్గురు సూపర్ స్టార్లను ఒకేసారి చూడటం అభిమానులకు కనువిందుగా మారింది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఒకే ఫ్రేమ్‌లో ముగ్గురు లెజెండ్స్, ఇండియన్ పవర్ హౌస్ అంటూ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. ఇంకా వీరే కాకుండా అక్షయ్ కుమార్, తమిళ నటుడు సూర్య కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ఆ సిరప్‌ను వాడటం నిలిపివేయండి.. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ ఆదేశాలు

పిల్లల కోసం వినియోగించే ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని నిలిపివేయాలని తెలంగాణ ఔషధ నియంత్రణ మండలి ( డీసీఏ) ఆదేశించింది. ఈ సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ ప్రమాదకరంగా ఉన్నట్లుగా గుర్తించిన నేపథ్యంలో ఈ హెచ్చరికలు చేసింది. బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమెడీస్ సంస్థ తయారు చేసిన AL 24002 బ్యాచ్ సిరప్‌ల్లో కల్తీ జరిగిందని పశ్చిమ బెంగాల్‌లో గుర్తించారు. ఈ నేపథ్యంలో కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనేషన్ నుంచి హెచ్చరికలు అందాయి. ఈ నేపథ్యంలో ఈ బ్యాచ్ సిరప్ ఎవరి వద్దనైనా ఉంటే.. వాడకం ఆపేయాలని.. అలాగే మార్కెట్‌లోనూ విక్రయాలను నిలిపివేయాలని తెలంగాణ డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం ఆదేశించారు. పిల్లలకు వాడే సిరప్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మందు పేరు: Almont-Kid Syrup
బ్యాచ్ నం: AL-24002
తయారీ తేదీ: Jan-2025
గడువు తేదీ: Dec-2026
దీనిపై సమాచారం లేదా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800-599-6969లో సంప్రదించాలని సూచించారు.





# ఫైనల్లో నిఖత్, లవ్లీన

జాతీయ సీనియర్ బాక్సింగ్ టోర్నీలో భారత స్టార్ బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహై ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మహిళల 48-51కిలోల సెమీస్ బౌట్‌లో నిఖత్ 4-1తో కుసుమ్ బఘేల్(ఉత్తరప్రదేశ్)పై అద్భుత విజయం సాధించింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ తన పంచ్ పవర్ ఏంటో రుచిచూపిస్తూ బౌట్‌ను ఏకపక్షంగా కైవసం చేసుకుంది. 70-75కిలోల సెమీస్ బౌట్‌లో టోక్యో ఒలింపిక్స్ కాంస్య విజేత లవ్లీన బోర్గోహై 5-0తో ఇమ్రోజ్‌ఖాన్(ఉత్తరప్రదేశ్)పై గెలిచి టైటిల్ పోరులో నిలిచింది. మిగతా బౌట్లలో ప్రపంచ చాంపియన్ మీనాక్షి(45-48కి) 5-0తో మలికా మోర్(మధ్యప్రదేశ్)పై, 51-54కిలోల కేటగిరీలో ప్రీతి 5-0తో ఆర్తీ దరియాల్‌పై గెలిచారు. పురుషుల 55-60కిలోల సెమీస్‌లో తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ 4-1తో రామన్(ఏఐపీ)పై గెలిచి తుదిపోరులో నిలిచాడు.

## రోహిత్ శర్మ నాకు ఎప్పటికీ కెప్టెనే: జై షా




రోహిత్ శర్మ తనకు ఎప్పటికీ కెప్టెన్ గానే ఉంటాడని ఐసీసీ ఛైర్మన్ జై షా అన్నారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మా కెప్టెన్ ఇక్కడ కూర్చొని ఉన్నాడు. నేను ఆయనను ఎప్పటికీ కెప్టెన్ అనే పిలుస్తాను. ఎందుకంటే రోహిత్ రెండు ఐసీసీ ట్రోఫీలు (2024 టీ20 వరల్డ్ కప్, 2025 చాంపియన్స్ ట్రోఫీ) తీసుకొచ్చాడు"అని కొనియాడారు.

# సంక్రాంతి పండుగ.. టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

సంక్రాంతి పండుగ వేళ నగరం నుంచి పల్లెబాట పట్టిన ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (NH-65) రద్దీగా మారింది. ఇవాళ ఉదయం నుంచే ఈ రహదారిపై ఎటు చూసినా వాహనాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణం, పంతంగి టోల్ ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. పండుగ సెలవులు ప్రారంభం కావడంతో వేలాది మంది జనం సొంతూళ్లకు తరలివెళ్తుండటం, మరోవైపు హైవేపై జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. టోల్ ప్లాజా వద్ద 3 సెకన్లకు ఒక వెహికల్ పాస్ అయ్యేలా ఏర్పాట్లు చేసినా.. రద్దీ తగ్గటం లేదు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఉండేందుకు పోలీసులు పలు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులకు పోలీసులు ప్రత్యేక సూచన చేశారు. సాధారణంగా వీరంతా నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారి మీదుగా వెళ్తుంటారు. అయితే విజయవాడ హైవేపై ప్రస్తుతం ఉన్న రద్దీ దృష్ట్యా, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్ మీదుగా వెళ్తే పంతంగి టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీనికి బదులుగా, హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్లడం ఉత్తమమని పోలీసులు




తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ (ORR) మీదుగా ప్రయాణించే వారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకుని సాగర్ హైవేలోకి ప్రవేశించవచ్చు. ఇది కొంచెం ఎక్కువ దూరమైనప్పటికీ.. ఎలాంటి ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా సాఫీగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అలాగే ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు కూడా విజయవాడ హైవేకు బదులుగా భువనగిరి మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా ప్రయాణించి నేరుగా చిట్యాలకు చేరుకోవచ్చు. చిట్యాల నుంచి నార్కట్‌పల్లిని దాటేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు చాలా వరకు తగ్గుతాయి. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఔటర్ రింగ్ రోడ్ మీదుగా వచ్చి ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ తీసుకొని వరంగల్ హైవేలోకి ప్రవేశించవచ్చు. లేదా సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు. ఈ ప్రత్యామ్నాయ మార్గాలు ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించగలవని ట్రాఫిక్ పోలీసులు వివరిస్తున్నారు. మరోవైపు ఆదివారం చౌటుప్పల్‌లో జరిగే వారంతపు సంత గురించి ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి ఆదివారం ఇక్కడ సంత జరగడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పండుగ రద్దీకి సంత వాహనాలు కూడా తోడైతే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుంది. అందువల్ల ఆదివారం ప్రయాణం చేసే వారు ఖచ్చితంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం మేలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



# ఇరాన్ సంక్షోభం

ఇరాన్ లో నెలకొన్న సంక్షోభం భారత బియ్యం ఎగుమతులపై పడింది. ప్రస్తుతం ఇరాన్ అంతర్యుద్ధంతో ఉడుకుతున్న సంగతి తెలిసిందే. ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక పరిస్తితి మందగించింది. మరోవైపు అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ దారుణంగా పడిపోయింది. దీంతో విదేశీ ఆహారోత్పత్తుల దిగుమతులపై ఇస్తున్న సబ్సిడీని ఇరాన్ ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఇండియా నుంచి ఇరాన్ కు ప్రీమియం బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఇరాన్ కు ఎగుమతి చేయాల్సిన బాస్మతి బియ్యం భారత గోడౌన్లలోనే నిలిచిపోయింది. దాదాపు రూ.2,000 కోట్ల విలువైన బియ్యం ఎగుమతులు నిలిచిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంలో ఇరాన్ నుంచి స్పష్టమైన హామీ ఇస్తేనే బియ్యం ఎగుమతులు సాధ్యమవుతాయి. ఇండియాలో పండే ప్రీమియం బాస్మతి బియ్యం ఎక్కువగా ఇరాన్ కు ఎగుమతి అవుతుంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు అత్యధికంగా బాస్మతి బియ్యం పండిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డాలర్ తో పోలిస్తే ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ అత్యల్ప స్థాయికి పడిపోయింది.

## చిరు సినిమా టికెట్ ధరల పెంపునకు తెలంగాణ సర్కారు అనుమతి


మెగాస్టార్ చిరంజీవి కొత్తసినిమా 'మన శంకరవరప్రసాద్ గారు' టికెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే, ఈ నెల 11న స్పెషల్ ప్రీమియర్ షోను ప్రదర్శించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రీమియర్ షోతో పాటు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా థియేటర్లలో టికెట్ ధరల పెంపు కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి టికెట్ ధరల పెంపునకు అనుమతినిచ్చింది. ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600, సింగిల్ స్క్రీన్ థియేటర్ లో టికెట్ ధర రూ.50 పెంపు, మల్టీప్లెక్స్ లలో రూ.100 మేరకు పెంచుకోవచ్చని సూచించింది. పెంచిన రేట్లను వారం రోజుల పాటు వసూలు చేసుకోవచ్చని తెలిపింది.



# టాక్సిక్ టీజర్ వివాదం

## స్పందించిన దర్శకురాలు

రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న భారీ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీసింది. యశ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ టీజర్‌లోని ఒక ఇంటిమేట్ సీన్ ఇప్పుడు సినిమాకన్నా పెద్ద వివాదంగా మారింది. యాక్షన్, గ్యాంగ్‌స్టర్ షేడ్స్‌తో రూపొందిన టీజర్‌లో హీరో లుక్ ఆకట్టుకున్నప్పటికీ, ఒక బోల్డ్ విజువల్ మాత్రం నెటిజన్ల దృష్టిని పూర్తిగా ఆకర్షించింది. టీజర్‌లో బయట కాల్పుల శబ్దాలు వినిపిస్తుండగా, కారులో యశ్ పాత్ర ఒక యువతితో సన్నిహితంగా ఉన్నట్లు చూపించిన సన్నివేశం కొందరికి అభ్యంతరకరంగా అనిపించగా, మరికొందరు దాన్ని కథన శైలిలో భాగంగా చూస్తున్నారు. ఈ సీన్‌పై విమర్శలు చెలరేగడంతో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ చివరకు స్పందించారు. అయితే ఆమె స్పందన సాధారణంగా కాకుండా వ్యంగ్య ధోరణిలో ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా ఆమె స్పందిస్తూ, సమాజం ఇప్పటికీ మహిళల ఆనందం, వారి సమ్మతి, స్వేచ్ఛ వంటి అంశాలపై చర్చల




దశలోనే ఉందని వ్యాఖ్యానించారు. ఈ చర్చలన్నింటి మధ్య తాను మాత్రం ప్రశాంతంగా ఉన్నానని పేర్కొనడం ద్వారా విమర్శలకు పరోక్షంగా సమాధానం ఇచ్చారు. ఆ సీన్‌ను కేవలం శృంగార దృశ్యంగా కాకుండా, మహిళల అనుభవాలు, వారి ఎంపికలను ప్రతిబింబించే కోణంలో చూడాలని ఆమె సంకేతాలిచ్చినట్టుగా భావిస్తున్నారు.



# కొత్త కోడలు

దాదాపు రెండున్నరేళ్ల విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు చిత్రం 'మా ఇంటి బంగారం'. స్వీయ నిర్మాణ సంస్థ ట్రాలాలా పతాకంపై ఆమె నిర్మిస్తున్న ఈ సినిమాకు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. పల్లెటూరిలోకి కొత్త కోడలిగా అడుగుపెట్టిన సమంతకు అక్కడ ఎదురైన అనుభవాలతో టీజర్ ఆసాంతం ఆసక్తికరంగా సాగింది. మా ఇంటి బంగారం అంటూ అత్తారింటి వారు ఆమెను ఆప్యాయంగా పిలుస్తుంటారు. పైకి అమాయకంగా కనిపిస్తూ అందరితో సఖ్యతగా ఉండే ఆమెలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ చూపించిన యాక్షన్ ఘట్టాలు కథపై ఆసక్తిని పెంచాయి. టీజర్‌ని బట్టి చూస్తే గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ ఫ్యామిలీ డ్రామా ఇదని అర్థమవుతున్నది. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్నందిస్తున్నారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## వెల్లివిరిసిన భక్తి.. 450 కి.మీ స్కేటింగ్ చేస్తూ
# అయోధ్యకు చేరిన 9 ఏళ్ల బాలిక



ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన ఓ తొమ్మిదేళ్ల బాలిక శ్రీరాముడిపై తనకున్న భక్తిని వినూత్నం రూపంలో చాటిచెప్పింది. అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకునేందుకు ఏకంగా ఫిరోజాబాద్ నుండి అయోధ్య వరకు 450 కిలోమీటర్లు స్కేటింగ్ చేస్తూ వెళ్లింది. ఆ శ్రీరాముడి పట్ల బాలికకు ఉన్న భక్తిపై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో సైతం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. వీడియో చూసిన జనాలు బాలిక భక్తిని మెచ్చుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన శివశంకర్ యాదవ్ కుమార్తె తొమ్మిదేళ్ల వంశిక ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆమెకు శ్రీరాముడిపై ఉన్న భక్తితో స్కేటింగ్ చేస్తూ వెళ్లి అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే జనవరి 3న తన ఫిరోజాబాద్ నుంచి తన యాత్రను ప్రారంభించింది. ఐదు రోజుల పాటు సుమారు 450 కిలో మీటర్ల దూరం స్కేటింగ్ చేస్తూ వంశిక అయోధ్యకు చేరుకుంది. ఎన్ని అడ్డకుంటు వచ్చానా ఆమె తన సంకల్పాన్ని కోల్పోలేదు.. బలంగా నిలబడి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. చివరకు తన ఆరాధ దైవమైన శ్రీరాముడిని దర్శించుకుంది. ఈ సందర్భంగా వంశికా యాదవ్ మాట్లాడుతూ రాముడిపై తనకున్న భక్తి, దృఢ సంకల్పమే తనను ఈ దిశగా నడిపించాయని చెప్పుకొచ్చింది.




## 14 నుంచి ఓటీటీలోకి దండోరా

తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 14 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు.

# పీవీ సింధు ఓటమి




భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో నిరాశ ఎదురైంది. ఇవాళ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో ఆమె చైనా క్రీడాకారిణి, ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జీ చేతిలో ఓటమి పాలైంది. దీంతో ఈ టోర్నీలో భారత పోరాటం ముగిసినట్లయింది. గాయం కారణంగా గత అక్టోబర్ నుంచి ఆటకు దూరంగా ఉన్న సింధు, ఈ టోర్నీతోనే పునరాగమనం చేసింది. సెమీస్ పోరులో సింధు 16-21, 15-21 తేడాతో వరుస సెట్లలో ఓడిపోయారు. కీలక సమయాల్లో అనవసర తప్పిదాలు చేయడం ఆమె విజయావకాశాలను దెబ్బతీసింది. తొలి గేమ్‌లో ఆరంభంలో 5-2తో ఆధిక్యం సాధించినా, వాంగ్ పుంజుకోవడంతో పోరు 13-13 వరకు హోరాహోరీగా సాగింది. ఆ తర్వాత వాంగ్ వరుస పాయింట్లతో పైచేయి సాధించి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత బలంగా పుంజుకుంది. అద్భుతమైన షాట్లతో విరామానికి 11-6తో మంచి ఆధిక్యంలో నిలిచింది. అయితే, విరామం తర్వాత వాంగ్ వ్యూహం మార్చి దూకుడుగా ఆడింది. సింధు చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకుని స్కోరును సమం చేసింది. 13-13 వద్ద ఆధిక్యంలోకి దూసుకెళ్లిన వాంగ్, ఆపై సింధుకు అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గాయం నుంచి కోలుకున్న తర్వాత ఆడిన తొలి టోర్నీలోనే సెమీఫైనల్ వరకు చేరడం సింధుకు ఈ సీజన్‌లో సానుకూల ఆరంభంగానే విశ్లేషకులు భావిస్తున్నారు.




## నాన్నే నా దేవుడు..
## తండ్రిపై ప్రేమను చాటుకున్న అల్లు అర్జున్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ 77వ పుట్టినరోజు సందర్భంగా ఆయన కుమారుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తన జీవితంలో దేవుడికి అత్యంత దగ్గరైన వ్యక్తి తన తండ్రేనంటూ ఆయనపై ఉన్న ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ మేరకు తన తండ్రితో కలిసి కొత్తగా ప్రారంభించిన అల్లు సినిమాస్ వద్ద దిగిన ఒక అందమైన ఫొటోను అల్లు అర్జున్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. నా జీవితంలో దేవుడికి అత్యంత దగ్గరైన వ్యక్తి మీరే. మీరు ఎల్లప్పుడూ ఆనందంగా జీవించాలి" అని తన పోస్టులో పేర్కొన్నారు. గీతా ఆర్ట్స్ వ్యవస్థాపకుడిగా అల్లు అరవింద్ టాలీవుడ్‌లో అత్యంత విజయవంతమైన నిర్మాతల్లో ఒకరిగా పేరుగాంచారు. ఆయన నిర్మించిన చిత్రాలలో 'పసివాడి ప్రాణం', 'జల్సా', 'గజిని', 'మగధీర', 'సరైనోడు', 'అల వైకుంఠపురములో' వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్లు ఉన్నాయి. ఇక అల్లు అర్జున్ కెరీర్ విషయానికొస్తే, ఆయన ప్రముఖ దర్శకుడు సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప 2: ది రూల్' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆయన పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దర్శకుడు త్రివిక్రమ్‌తో కలిసి ఒక పౌరాణిక చిత్రంలో నటించనుండగా, ఇది 2027 ఫిబ్రవరిలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. దీంతో పాటు 'పుష్ప3' సుకుమార్ దర్శకత్వంలో రానుంది. అలాగే స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది.



## ఉద్యోగాలు ఏవంటూ విద్యార్థుల నిరసన..
## అడుగడుగున పోలీసుల నిర్బంధం

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఉద్యోగాల ఊసే ఎత్తకపోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ధర్నాలు, ఆందోళనలతో తమ నిరసన గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇవాళ నిరుద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించతలపెట్టారు. ఆ మేరకు ఇప్పటికే పిలుపునిచ్చారు. హైదరాబాద్—చిక్కడపల్లి లైబ్రరీ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీగా వెళ్లి మహా ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, వెంటనే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు.




## హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం:
## బస్సు లోయలో పడి 12 మంది మృతి

బస్సు లోయలో పడిన ఘోర ప్రమాదం — 12 మృతి, 35 గాయపడారు హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రైవేట్ ప్రయాణికుల బస్సు 400 మీటర్ల లోతైన లోయలో పడి 12 మంది ప్రాణాలు కోల్పోయారు, మరో 35 మంది గాయపడ్డారు. సిర్మౌ జిల్లాలోని హరిపుర్ధార్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బస్సు ఏటవాలుగా ఉన్న సూటి రోడ్డుపై నుంచి జారిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు సోలన్ నుండి రాజ్‌ఘడ్, హరిపుర్ధార్ మార్గం ద్వారా కుప్వీకి వెళ్తోంది.ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ప్రాథమిక నివేదికల ప్రకారం, ఏటవాలు మలుపు దిగుతున్నప్పుడు డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడినవారిని సమీపంలోని హరిపుర్ధార్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. అలాగే, ప్రధానమంత్రి కార్యాలయం కూడా అధికారిక ప్రకటన విడుదల చేసి మృతుల కుటుంబాలకు ఒక్కోరికి రూ. 2 లక్షల చొప్పన, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పన పింఛను (పరిహారం) అందజేయనున్నట్లు తెలిపారు.



## సంక్రాంతి ముగ్గుల పోటీల్లో
## ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి

సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి చేశారు. సంక్రాంతి నేపథ్యంలో పూడూరు-కిష్టాపూర్ డివిజన్ KLR ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకుడు ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలను ఉత్సాహపరుస్తూ.. ఆయన కూడా స్వయంగా ముగ్గు వేశారు.



## ఇరాన్ నిరసనలు..
## 200 మంది మృతి?

అగ్నిగుండంలా మారింది. సుప్రీం లీడర్ ఖమేనీ వ్యతిరేక నిరసనలతో దేశం అట్టుడుకుతున్నది. రాజకీయ, ఆర్థిక మార్పులు డిమాండు చేస్తూ ఇరాన్ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటడంతో గురువారం రాత్రి నుంచి దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, ఇతర కమ్యూనికేషన్లు నిలిచిపోయాయి. తాజా ఆందోళనలో దాదాపు వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజా నిరసనల్లో 200 మందికిపైగా మరణించినట్లు ఓ వైద్యుడు వెల్లడించారు. ఈ మరణాలు ఒక్క రాజధాని టెహ్రాన్ లోనే చోటు చేసుకున్నట్లు తెలిపారు. టెహ్రాన్‌లోని దాదాపు ఆరు ఆసుపత్రుల్లో 217 మంది నిరసనకారులు మరణించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉండొచ్చంటూ వ్యాఖ్యానించారు. మృతుల్లో ఎక్కువమంది యువకులే ఉన్నట్లు తెలిపారు. ఉత్తర టెహ్రాన్ పోలీస్ స్టేషన్ వెలుపల భద్రతా దళాలు నిరసనకారులపై మెషిన్ గన్లతో కాల్పులు జరపడంతో 40 మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారన్నారు.



## పెద్దపల్లిలోనే
## జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి..

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోనే జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ, పెద్దపల్లి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కోటగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఐటిఐ కాలేజీ మైదానం లేదా మార్కెట్ యార్డ్ లో జిల్లా కోర్టు భవనాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ ఏఓ బండి ప్రకాష్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.